క్లుప్తంగా

హనుమాన్ పురస్కారాల ప్రదానం


అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

పలమనేరు : బైరెడ్డిపల్లెకు చెందిన సంప్రదాయ కళల పరిరక్షణ సంస్థ వారు వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 116 మంది సమాజ సేవకులకు భక్త హనుమాన్ పురస్కారాలను ప్రదానం చేశారు. సోమవారం ఈ మేరకు పలమనేరు మండలంలోని అంజనాద్రి ఆలయం వద్ద అవార్డులు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చిరంజీవి, నిర్వాహకులు తిప్పక్కతోపాటు సుకన్య, మల్లిక, యోగా మాస్టర్ నందగోపాల్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

పలమనేరు : మండలంలోని క్యాటిల్‌ఫామ్‌లో వెలసిన ఏటిగడ్డ ఎల్లమ్మ గంగ జాతర సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. మంగళవారం ఆలయం వద్ద పొంగళ్లు, పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నారు. మొరం పంచాయతీ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు జాతరకు హాజరయ్యారు.

ఘనంగా రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల ప్రతిష్టాపన


పూజలో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక పాతకలెక్టరేట్ ఆవరణలోని శ్రీ కామాక్షి అంబికాదేవి సమేత శ్రీ సదాశివేశ్వరసామి దేవాలయంలో సోమవారం మూలవర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి నాడు వెంకటేశ్వరస్వామి విగ్రహం ముందు ఉదయం ప్రత్యేక పూజలు చేసి పాదాలను ప్రతిష్ఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది మామిడి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. మరోపక్క గుజ్జు పరిశ్రమ యజమానులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులను నిలువున దోచుకుంటున్నారని వాపోయారు. తోతాపురి టన్ను రూ.28 వేలు పలుకుతున్నప్పటికీ కేవలం రూ.23వేలకే కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. తోతాపురి టన్నుకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్, వెంకటరత్నం, వెంకటయ్య, ఉమాపతి నాయుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పలమనేరు : బక్రీద్ ప్రాశస్త్యం వివరిస్తున్న మత పెద్దలు


పుంగనూరులో ప్రార్థన ముగించుకుని వస్తున్న ముస్లింలు


సదుంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


భక్తిశ్రద్ధలతో బక్రీద్

ప్రవక్త బోధనలు స్మరించుకుంటూ.. ఇస్లాం పవిత్రతను ఎలుగెత్తి చాటుతూ.. పేదలను దానధర్మాలతో ఆదుకుంటూ.. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తూ.. పరస్పరం ఈద్‌ముబారక్ తెలుపుకుంటూ.. సోదరభావంతో ఆలింగనం చేసుకుంటూ.. కుర్బానీ విశిష్టతను అర్థం చేసుకుంటూ.. బంధుమిత్రులతో కలిసి విందు భోజనం ఆరగిస్తూ.. మత సామరస్యానికి ప్రతీకగా ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకుంటూ.. అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లింలు సోమవారం బక్రీద్ పండుగను నిర్వహించుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని మసీదులు.. ఈద్గాల వద్ద నమాజు చేశారు.

- ఇస్లాం పవిత్రతను చాటేలా వేడుకలు
- మతసామరస్యానికి ప్రతీకగా ప్రార్థనలు
- పేదలకు దానధర్మాలు చేసిన ముస్లింలు
- పండుగ నాడు కిటకిటలాడిన మసీదులు


ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ..


పలమనేరు ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు


శుభాకాంక్షలు తెలుపుకుంటూ..

పలమనేరు : ముస్లింలు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే మసీదులు, ఈద్గాల వద్దకు చేరుకుని నమాజు చేశారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని కొలమాసనపల్లె, రాజీవ్‌నగర్ కాలనీ, నాగమంగళం, పకీర్ పల్లె ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. పట్టణంలోని ముస్లింలు అల్లాను స్మరిస్తూ ఈద్‌ఉల్ జుహా అనే ప్రత్యేక నమాజ్‌ను చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సోదరభావం చాటుకున్నారు. బంధుమిత్రులకు ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. పేదలకు శక్తి మేర దానధర్మాలను చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు, గురువులు మాట్లాడుతూ త్యాగాలకు ప్రతీకైన బక్రీద్ విశిష్టతను విపులంగా వివరించారు. ప్రతి ముస్లిం జీవితంలో హజ్ యాత్ర పరమార్థం గురించి తెలియజేశారు. జంతు మాంసాలను పేదలకు, బంధుమిత్రులకు, మిగిలింది కుటుంబాలకు ఇలా మూడు బాగాలుగా చేసి వండుకుంటారు కాబట్టే దీన్ని త్యాగాల పండుగ అంటారని వివరించారు. అనంతరం కుర్బానీ ప్రాశస్త్యాన్ని వెల్లడించారు. అల్లాకు తన బిడ్డనే బలి ఇచ్చేందు భక్తుడు సిద్ధ పడినపప్పుడు ఆ స్థానంలో గొర్రె పిల్లలను బలిగా ఇవ్వాలని అల్లా సూచించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ముస్లింలు బిరియానీ, ఫిర్నీ, మిట్టీ సేమియాలను బంధు మిత్రులకు పంచిపెట్టారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ శుభాకాంక్షలు తెలిపారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించారు. కల్లూరు, మంగళంపేట, కొమ్మిరెడ్డి గారిపల్లె, ఎల్లంకివారిపల్లె, పులిచెర్లలోని ఈద్గా, మసీదుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

గంగవరంలో..

గంగవరం : మండలంలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మతపెద్దల ఆధ్వర్యంలో ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమకు తోచిన విధంగా పేదలకు ధాన ధర్మాలు చేశారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. రామకుప్పం, బల్ల, గెర్నిపల్లెలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పవిత్రత గురించి ముస్లిం మత గురువులు వివరించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని రాయలపేట, చిన్నేపల్లె, పెద్దపంజాణి, బద్రాచలం, దేవిరెడ్డిపల్లె, శివాడి, బట్టందొడ్డి, చీమనపల్లె, సంపల్లె, పెనుగొలకల, కొళత్తూరు, మల్లసముద్రం గ్రామాల్లో మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

సదుంలో..

సదుం : మండలంలో బక్రీద్ పర్వదినాన్ని వేడుకగా నిర్వహించారు. సదుం, ఊటుపల్లె, బూరగమంద, చెరుకువారిపల్లె, పాలమంద, చింతపర్తివారిపల్లె తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.. దయ, శాంతి, దానగుణాలను కలిగి ఉండాలని మత పెద్దలు సూచించారు. పూర్వీకుల సమాధుల వద్ద దువా చేశారు.

వర్షంతో అంతరాయం

పుంగనూరు : బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వర్షం కారణంగా ముస్లింలు ఈద్గాలో ప్రార్థనలకు వెళ్లలేకపోయారు. దీంతో పట్టణంలోని ఆయా ప్రాంతాలలోని మసీదులు, ఇళ్ల వద్ద ముస్లింలు ప్రార్థనలు చేపట్టారు. ఈ క్రమంలోనే మసీదులు, ఇళ్ల వద్ద పేదలకు మాంసం, నగదు, దుస్తులు, అన్నదానం చేపట్టారు. హిందూ ముస్లింలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ విందు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: త్యాగానికి, సత్యానికి ప్రతీకైన బక్రీద్ పండుగను మండలంలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం పట్టణంలోని అన్ని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ముఖ్యంగా రహమత్ నగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె : మండలంలోని కొడతనపల్లె, గుడుపల్లె, గుండ్లసాగరం, కుప్పిగానిపల్లె, మిట్టూరు తదితర గ్రామాలలో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు.

కుప్పంలో..

కుప్పం : బక్రీద్ పండుగ సందర్భంగా కుప్పం పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని మసీదుల్లో ప్రార్థనలు చేశారు. బాబునగర్ ఉన్నా మసీదుల్లో బక్రీద్ ప్రాముఖ్యతను , దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకున్నారు. అనంతరం బాబునగర్ వరకు ముస్లింలు ర్యాలీ చేపట్టారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలోని రొంపిచెర్ల, బండకిందపల్లె, మల్లెలకస్పా, గానుగచింత గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పేదలకు దానధర్మాలు చేశారు.


చిన్నేపల్లె ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు


కుప్పంలో..


కొడతనపల్లెలో..

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ కుంభాభిషేకం

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం గ్రామంలో సోమవారం దుర్గాలమ్మ ఆలయానికి కుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఉదయం గోపూజ, వినాయకపూజ, విశ్వరూపదర్శనం, కలశపూజ, పూర్ణాహుతి, మృత్యుంజయహోమం, మహా కుంభాభిషేకం, ప్రాణప్రతిష్ఠ, మహానైవేద్యంతో పాటు తులసిమాల సేవ నిర్వహించారు. సుబ్రమణ్యస్వామిని ప్రాణప్రతిష్ఠ చేసి, హోమం నిర్వహించారు. దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు, అర్చన చేసి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకుడు


విశేషాలంకరణలో అమ్మవారు


భక్తుల అన్నదానం

నక్షత్ర తాబేళ్ల జాడేది..?

- కౌండిన్య అటవీ ప్రాంతంలో కనిపించని తాబేళ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- కొండెక్కిన సంరక్షణ

పలమనేరు : ప్రభుత్వ లక్ష్యం ఎంత గొప్పదైనా అధికారుల్లో చిత్తశుద్ధి కొరవడితే బూడిదలో పోసిన పన్నీరే. పలమనేరు మండలంలోని కౌండిన్య అభయారణ్యంలో నక్షత్ర తాబేళ్లను సంరక్షించేందుకు ఓ ప్రాంతముంది. అయితే వీటి గురించి పట్టించుకొనే నాథుడే లేకపోవడంతో తాబేళ్లు ఉన్నాయో లేవో అనేది అధికారులకే తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రపంచంలోనే అత్యంత అరుదైన నక్షత్ర తాబేళ్ల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. వివరాల్లోకెళితే...పలమనేరు మండలంలోని కౌండిన్య అభయారణ్యాన్ని ఎలిఫెంట్ జోన్‌గా 1983లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఏనుగులతో పాటు జింకలు, దుప్పులు, అడవి పందులు, నెమళ్లు వేల సంఖ్యలో ఉన్నాయి. వీటితో పాటు నక్షత్ర తాబేళ్లు కూడా ఉన్నాయి. గతంలో నక్షత్ర తాబేళ్ల అక్రమ రవాణా జోరుగా సాగేది. అక్కడక్కడా స్మగ్లర్ల నుంచి వీటిని స్వాధీనం చేసుకున్న అధికారులు తిరుపతిలోని ఎస్వీ జూకు తరలించేవారు. అయితే తిరుపతిలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో నక్షత్ర తాబేళ్ల మనుగడ కష్టతరంగా మారింది. దీంతో కౌండిన్య అభయారణ్యంలో కాలువపల్లెకు తూర్పు వైపు వంద హెక్టార్ల స్థలాన్ని అటవీశాఖ గుర్తించింది. ఇక్కడ ఈ నక్షత్ర తాబేళ్లను సంరక్షించాలని అధికారులు భావించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఒండ్రుమట్టితో కూడిన అడవి, మధ్యలో ఓ చెరువు ఉంది. ఐదేళ్ల నుంచి జిల్లాలో దొరికిన నక్షత్ర తాబేళ్లను ఈ ప్రాంతంలో వదులుతున్నారు. అయితే ఇవి ఎక్కడ ఉన్నాయి, వీటి పరిస్థితి కనిపెట్టేందుకు వీటి శరీర భాగంలో కంప్యూటర్ చిప్‌ను అమర్చారు. ఈ చిప్ ద్వారా తిరుపతిలోని జూ నుంచి పర్యవేక్షించేవారు. అడవిలోని ఈ తాబేళ్లు ఎక్కడెక్కడున్నాయి, ఎలా ఉన్నాయి నిత్యం గమనించేవారు. ఇందుకోసం ఓ ప్రత్యేక అధికారిని సైతం అప్పట్లో నియమించారు.

గతంలో వేలసంఖ్యలో నక్షత్ర తాబేళ్లను ఈ ప్రాంతంలో వదలిపెట్టారు. స్థానిక అటవీశాఖ, జూ అధికారుల పర్యవేక్షణలో మొత్తం ప్రక్రియ సాగుతుండేది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో వీటి నిర్వహణ నీరుగారింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎంత వెతికినా తాబేళుల ఏమయ్యాయో కూడా తెలియడం లేదు. ఓవైపు జూ అధికారులు పట్టించుకోకపోవడం, తమకెందుకులేనని అటవీశాఖ అధికారులు వదిలేయడంతో తాబేళ్లు ఈ అడవిలోనే అంతరించిపోయాయి. ఇప్పుడు చిప్ ద్వారా ప్రయత్నించినా వాటి జాడ తెలియడం లేదు.


కౌండిన్య అటవీ ప్రాంతం


కాలువపల్లె అడవిలో నక్షత్ర తాబేలు (ఫైల్)

ట్రాన్స్‌‘ఫార్మర్ కష్టాలు’..!

- ఓవర్ లోడ్ కారణంగా కాలిపోతున్న పరికరాలు
- రీప్లేస్‌మెంట్‌ను పట్టించుకోని అధికారులు
- సకాలంలో నీరందక ఎండుతున్న పంటలు

పలమనేరు : నియోజకవర్గంలో సుమారు 20 వేల బోరుబావులు ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు ఆశాజనకంగా పెరిగాయి. ఈ క్రమంలో రైతులు భారీగా పంటల సాగు చేపట్టారు. వ్యవసాయం పెరగడంతో విద్యుత్ వినయోగం సైతం అందుకు తగ్గట్టుగానే అధికమైంది. గతంతో 15 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను ముగ్గురు రైతులు వాడేవారు. అప్పట్లో నీటి లభ్యత లేని కారణంగా ఒకరో ఇద్దరో రైతులు మాత్రమే సాగు చేసుకునేవారు. అప్పుడు ఓ ట్రాన్స్ ఫార్మర్ నుంచి అధిక సంఖ్యలో అన్నదాతలు విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో ఓవర్ లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. నిత్యం 5 నుంచి 10 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి.

రీప్లేస్‌మెంట్‌కు తప్పని ఇబ్బందులు

ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలి కుప్పలు తెప్పలుగా వచ్చి పడితుండడంతో వాటిని మరమ్మతులు చేయడం విద్యుత్ సిబ్బందికి కష్టతరంగా మారింది. దీంతో ఓ రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ రీప్లేస్‌మెంటు చేయాలంటే దాదాపు పది రోజులుకు పైగా పడుతోంది. ఈ క్రమంలో వరి పైర్లు నీరులేక ఎండిపోతున్నాయి. కళ్లముందే చేతికొచ్చే దశలో పంట వాలిపోతుంటే రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏడీ చిన్నబ్బను వివరణ కోరగా.. కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రీప్లేస్‌మెంట్లు ఎప్పకప్పుడు చేస్తూనే ఉన్నామన్నారు. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బందికి మామూళ్లు ముట్టజెపితే కానీ పనులు కావడంలేదని రైతులు ఆరోపిస్తుండడం గమనార్హం.


పలమనేరులోని మరమ్మతు కేంద్రంలో పడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

కొనసాగుతున్న వైద్య శిబిరం

పలమనేరు : మండలంలోని టి.వడ్దూరు గ్రామంలో ఇటీవల అతిసార ప్రబలడంతో పలువురు ఆస్పత్రిపాలైన విషయం తెలిసిందే. దీంతో గత మూడు రోజులుగా గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ మేరకు అతిసార లక్షణాలు గుర్తించిన వారికి చికిత్సలందించారు. అవసరాలకు తగ్గట్టు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


చికిత్సలందిస్తున్న వైద్యసిబ్బంది